సాక్షి
సిద్దిపేట
శుక్రవారం । 20 । డిసెంబర్ । 2024



రెవెన్యూ డివిజన్ అయ్యేనా?

మంత్రి పొంగులేటి ప్రకటన నేపథ్యంలో 'దుబ్బాక రెవెన్యూ డివిజన్'పై ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి. – వివరాలు 8లో ▸



శాంతిభద్రతల పరిరక్షణకు..

శాంతి భద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు సిద్దిపేట సీపీ అనురాధ తెలిపారు. –వివరాలు 8లో ▸

నేడు డయల్ యువర్ డీఎం

హుస్నాబాద్: డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు హుస్నాబాద్ బస్ డిపో మేనేజర్ సీహెచ్ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ఉంటుందన్నారు. **73828 52772**కు కాల్ చేసి సలహాలు, సూచనలు చేయాలన్నారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

న్యూస్‌రీల్

అధికారులకు మెమోలు

సమయపాలన పాటించాలని కలెక్టర్ ఆదేశం

సాక్షి ఎఫెక్ట్..

సిద్దిపేటరూరల్: కలెక్టరేట్‌లో సమయపాలన పాటించని అధికారులకు కలెక్టర్ మనుచౌదరి మెమోలు జారీ చేశారు. గురువారం సాక్షిలో ప్రచురితమై 'సమయపాలన ఏది' అనే శీర్షికకు కలెక్టర్ స్పందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పౌరసరాఫరాల శాఖ, ఎక్సైజ్, పశుసంవర్ధక శాఖ, భూకొలతల శాఖల అధికారులకు మెమోలను జారీ చేయడమేకాక సంజాయిషీ కోరారు. అధికారులందరూ సమయపాలన పాటించాలని, లేని క్రమంలో చర్యలు తీసుకుంటామని స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు.

ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి: అబ్దుల్ హమీద్

సిద్దిపేటఎడ్యుకేషన్: ప్రతి విద్యార్థికి ఇంటర్మీడియెట్ విద్య ఎంతో కీలకమని, ఉత్తమ ఫలితాల సాధనకు ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు కృషి చేయాలని అదనపు కలెక్టర్ అబ్దుల్‌హమీద్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు, విద్యార్థుల ఒత్తిడి తదితర అంశాలపై ఆయా విభాగాల అధికారులతో జిల్లా స్థాయి సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, వైద్య, టాస్క్‌ఫోర్స్ తదితర విభాగాల అధికారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఇంటి వద్దకంటే కళాశాలల్లోనే అధిక సమయం గడుపుతారని వారిని ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటర్ విద్యాధికారి రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ షెడ్యూల్ ప్రకారం సిలబస్ పూర్తి చేసి ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డితో పాటు ఆయా విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలను క్రమబద్ధీకరించండి



ర్యాలీ నిర్వహిస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

సిద్దిపేటకమాన్: ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలంటూ సిద్దిపేట పట్టణంలో సమగ్ర శిక్షా ఉద్యోగులు గురువారం ర్యాలీ నిర్వహించారు. ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా సమస్యలు పరిష్కారం కావడంలేదన్నారు. చాలా ఏళ్లుగా అరకొర జీతాలతో పని చేస్తూ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలన్నారు. వీరికి భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ నాయకులు మద్దతు తెలిపారు.

ఆర్థికాభివృద్ధికి రుణాలు అందించండి

సిద్దిపేటరూరల్: ప్రజల ఆర్థిక అభివృద్ధికి రుణాలు మంజూరు చేయాలని అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ బ్యాంకర్లను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు నిర్దేశించిన లక్ష్యం చేరేలా స్వయం ఉపాధి రుణాలను సకాలంలో అందించాలన్నారు. స్వయం సహాయక సంఘాల బ్యాంక్ లింకేజ్ రుణాల లక్ష్యం రూ. 895.69 కోట్లకు గాను రూ.643 కోట్ల రుణాలను మాత్రమే అందించామని మిగతా లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎల్డీఎం హరిబాబు, డీఆర్డీఓ జయదేవ్ ఆర్యా, జిల్లా హార్టికల్చర్ అధికారి సువర్ణ, బ్యాంకర్లు పాల్గొన్నారు.

సెకండ్ ఏఎన్ఎంల నిరసన



రాత్రి వేళ కలెక్టరేట్ ఎదుట ఏఎన్ఎంల నిరసన

సిద్దిపేటరూరల్: రాత పరీక్షను నిలిపి వేయాలంటూ సెకండ్ ఏఎన్ఎంలు గురువారం రాత్రి వేళ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇరవై ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న వారిని కాదని, ప్రభుత్వం నోటిఫికేషన్ వేయడం తగదన్నారు. ఈనెల 29న జరగనున్న ఎంపీహెచ్ఏ రాత పరీక్షను నిలిపి వేయాలన్నారు. ప్రభుత్వం తమకు ఎలాంటి రాత రాత పరీక్ష లేకుండా రెగ్యులర్ చేసేందుకు త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. ఆ కమిటీ ఎలాంటి చర్యలు చేపట్టకుండానే నోటిఫికేషన్ వేయడం ఏమిటన్నారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సంఘాల పోరాట కమిటీ నాయకులు పాల్గొన్నారు.

చేంజ్‌మేకర్ అవార్డులు

సిద్దిపేట, హుస్నాబాద్‌కు జాతీయ స్థాయి గుర్తింపు



ఢిల్లీలో అవార్డును స్వీకరిస్తున్న సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్

సిద్దిపేటజోన్: సిద్దిపేట, హుస్నాబాద్ మున్సిపాలిటీలు జాతీయ స్థాయిలో అవార్డులు సొంతం చేసుకున్నాయి. ఢిల్లీలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సదస్సులో ది చేంజ్ మేకర్ -2022 అవార్డును సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ అందుకున్నారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ కేటగిరీలో సిద్దిపేట మున్సిపాలిటీ అవార్డు సాధించింది. స్వచ్ఛ భారత్ మిషన్ 2.0లో భాగంగా సెంటర్ ఫర్ సైన్స్ ఎన్విరాన్మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన పారిశుద్ధ్య నిర్వహణలో సిద్దిపేట మెరుగైన ఫలితాలు సాధించడంతో ది చేంజ్ మేకర్ అవార్డు ప్రకటించారు. ఈ సందర్భంగా ఢిల్లీలో నిర్వహించిన సదస్సులో మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ మాట్లాడారు. పారిశుద్ధ్య నిర్వహణ, సాలిడ్ వెస్ట్ మేనేజ్మెంట్ ప్రక్రియ, స్వయం సహాయక సంఘాల పనితీరు, ఇంటింటికీ వందశాతం చెత్త సేకరణ, పట్టణంలో తడి, పొడి, హానికర చెత్త విభజన, స్వచ్ఛ బడి ద్వారా చెత్త ప్రాముఖ్యత గూర్చి అవగాహన కల్పించారు. అలాగే డీఆర్సీ కేంద్రం పనితీరు, తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ వనిత పాల్గొన్నారు.

హుస్నాబాద్ మున్సిపాలిటీకి..

హుస్నాబాద్: సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన హుస్నాబాద్ మున్సిపాలిటీకి అవార్డు దక్కింది. ఈ సందర్భంగా గురువారంలో ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో సీఎస్ఈ డైరెక్టర్ చేతుల మీదుగా చేంజ్ మేకర్ అవార్డును ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ డి.రవికుమార్ ఆదుకున్నారు. స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



జిల్లా కేంద్రంలోని కోమటిచెరువు ట్యాంక్‌బండ్‌పై ఉదయం వేళ ప్రకృతి అందాలు కనువిందు చేశాయి. చెరువులోని నీటిపై కళాకారుడు గీసిన చిత్రంలా ప్రతిబింబ సోయగం చూపరులను కట్టిపడేసింది.

– సాక్షి, స్టాఫ్ ఫొటో గ్రాఫర్, సిద్దిపేట

ప్రతిబింబ సోయగాలు

కొనుగోళ్లలో రికార్డు

జిల్లాలో పత్తి కొనుగోళ్లు రికార్డు స్థాయిలో కొనసాగుతున్నాయి. గతేడాది సీజన్ ముగిసే నాటికి 9.95లక్షల క్వింటాళ్ల లావాదేవీలు జరిగితే.. ఈసారి ఇప్పటికే 8.96లక్షల క్వింటాళ్ల కొనుగోళ్లు జరిగాయి. సీజన్ ముగిసేందుకు మరో రెండు నెలలకుపైగా సమయం ఉంది. కొనుగోళ్ల సందర్భంగా ఆన్‌లైన్ రికార్డుల్లో తప్పులున్నా.. వాటిని సరిచేసి ఉత్పత్తులను అమ్ముకునే వీలు కల్పించడం.. సరిహద్దున ఉన్న పొరుగు జిల్లాలు మెదక్, జనగామ, యాదాద్రి, మేడ్చల్ జిల్లాల నుంచి ఇక్కడికి ఉత్పత్తులు తరలిరావడం ఇందుకు కారణం.



గజ్వేల్ ప్రాంతంలో సీసీఐ పత్తి కొనుగోళ్లు

తరలివస్తున్న పత్తి ఉత్పత్తులు

- ఇప్పటికే 8.96 లక్షల క్వింటాళ్ల లావాదేవీలు
- నిబంధనల సడలింపు..
- మరోవైపు పొరుగు జిల్లాల నుంచి తరలివస్తున్న సరుకు

గజ్వేల్: పత్తి కొనుగోళ్లలో జిల్లా హబ్‌గా మారుతోంది. జిల్లాకు సరిహద్దున ఉన్న మెదక్, జనగామ, యాదాద్రి, మేడ్చల్ జిల్లాల రైతులు పత్తిని అమ్ముకోడానికి తరలివస్తుండటంతో కొనుగోళ్లు రికార్డుస్థాయిలో జరుగుతున్నాయి. ఈ జిల్లాలో వానాకాలానికి సంబంధించి 1.04లక్షల ఎకరాలు పత్తి సాగులోకి వచ్చింది. గతంతో పోలిస్తే ఈసారి తొలుత అనావృష్టి, ఆ తర్వాత అతివృష్టితో భిన్నమైన వాతావరణం ఉండటంతో పంట ఉత్పత్తులు గణనీయంగా పడిపోయే పరిస్థితి వచ్చింది. అయినా ఈసారి జిల్లా వ్యాప్తంగా 9లక్షల క్వింటాళ్ల దిగుబడులు రావొచ్చని మార్కెటింగ్ శాఖ అంచనా వేసింది.

నిబంధనలు సరళతరంతో..

పత్తిని అమ్ముకోవడానికి వచ్చే రైతులు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో పంటను సాగుచేసినట్లు నమోదు చేసిన సర్టిఫికెట్‌ను ఏఈఓలతో ధ్రువీకరించుకొని సీసీఐ అధికారులకు సమర్పించాల్సి ఉంటుంది. ఏదేనీ కారణంతో ఆన్‌లైన్‌లో పత్తి పంట నమోదు కాకుంటే గతంలో ఉత్పత్తులను తిరస్కరించేవారు. కానీ ఈసారి ఇలాంటి రైతులకు అప్పటికప్పుడు ఏఈఓలు తాత్కాలిక సర్టిఫికెట్లు ఇచ్చేందుకు కలెక్టర్ అనుమతివ్వడంతో ఇబ్బందులు తొలిగిపోయాయి. ఇతర జిల్లాల రైతులకు సైతం తాత్కాలిక సర్టిఫికెట్లు ఇచ్చి కొనుగోళ్లు సజావుగా సాగేలా చూస్తున్నారు. ఇకపోతే ప్రైవేటు వ్యాపారులు తక్కువ ధరకు పత్తిని కొనుగోలు చేస్తుండటం వల్ల రైతులంతా సీసీఐ కేంద్రాలపైనే ఆధారపడుతున్నారు. ప్రస్తుత సీజన్‌లో పింజి పెద్ద పత్తికి గరిష్టంగా రూ.7,521, కనిష్టంగా రూ.7,124 మద్దతు ధరగా ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెల్సిందే. జిల్లాలోని 24 జిన్నింగ్ మిల్లులను సీసీఐ కేంద్రాలుగా నోటిఫై చేయడంతో కొనుగోళ్లు వేగంగా సాగడానికి మరో కారణంగా చెప్పొచ్చు.

అంచనాలకు మించి కొనుగోళ్లు..

ఇప్పటికే అంచనాలకు మించి కొనుగోళ్లు సాగాయి. గతేడాది సీసీఐ ద్వారా 7.46లక్షల క్వింటాళ్లు, ప్రైవేటు వ్యాపారులు మరో 2.49లక్షల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేయగా మొత్తంగా 9.95లక్షల క్వింటాళ్ల లావాదేవీలు సాగాయి. కానీ ఈసారి డిసెంబర్ 18నాటికే సీసీఐ ద్వారా 7.27లక్షల లక్షల క్వింటాళ్లు, మరో 1.69లక్షల క్వింటాళ్లు ప్రైవేటు వ్యాపారుల కొనుగోలు చేశారు. మొత్తంగా ఇప్పటికే 8.96లక్షల క్వింటాళ్ల లావాదేవీలు సాగాయి.

పొరుగు జిల్లాల ఉత్పత్తులు రాకతో..

పొరుగు జిల్లాల నుంచి కూడా ఇక్కడికి పత్తి ఉత్పత్తులు తరలివస్తున్నాయి. దీంతో భారీగా కొనుగోళ్లు సాగుతున్నాయి. కొనుగోళ్ల సందర్భంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. సీసీఐ సిబ్బందికి ఎప్పటికప్పుడు సూచనలు చేస్తున్నాం. ప్రైవేటు వ్యాపారుల లావాదేవీలను సైతం పర్యవేక్షిస్తున్నాం.

– నాగరాజు, జిల్లా మార్కెటింగ్ అధికారి

29న కోర్టు భవనం ప్రారంభం

- ఏర్పాట్లు వేగిరం చేయాలి
- అధికారులను ఆదేశించిన జిల్లా జడ్జి సాయిరమాదేవి



కోర్టు హాలులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జడ్జి సాయిరమాదేవి, కలెక్టర్ మనుచౌదరి

చేర్యాల(సిద్దిపేట): పట్టణ పరిధిలో ఈ నెల 29న జూనియర్ సివిల్ (సెషన్) కోర్టు భవనం ప్రారంభం నేపథ్యంలో ఏర్పాట్లు వేగిరం చేయాలని జిల్లా జడ్జి సాయిరమాదేవి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ మనుచౌదరితో కలిసి భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె అధికారులకు పలు సూచనలు చేశారు. కోర్టు ఆవరణలో ప్లాంటేషన్ చేయాలన్నారు. భవనంలో పల సరిపడా ఫర్నిచర్, వసతి, తదితర చిన్న చిన్న మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి హైకోర్టు నుంచి పలువురు ప్రముఖులు హాజరవుతున్నందున భారీ బందోబస్తుకు చర్యలు తీసుకోఆవలని హుస్నాబాద్ ఏసీపీ సతీష్‌కి సూచించారు. వారి వెంట ఆర్డీఓ సదానందం, డీఎల్పీఓ మల్లికార్జున్, తహసీల్దార్ సమీర్ అహ్మద్ ఖాన్, మున్సిపల్ కమిషనర్ నాగేందర్, ఎంపీడీఓ మహమ్మద్ అలీ, పోలీస్ అధికారులు ఉన్నారు.

సాధారణ ప్రసవాల సంఖ్య పెంచండి

- కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి
- ఆరోగ్య కార్యక్రమాల సేవలపై కలెక్టర్ సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేటరూరల్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచేలా చొరవ చూపాలని కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఆరోగ్య కార్యక్రమాల సేవలు, పనితీరుపై వైద్యాధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఓపీ తోపాటు ఇన్‌పేషెంట్ సంఖ్య పెంచాలన్నారు. వ్యాధి నిరోధక టీకాలను పిల్లలకు, గర్భిణులకు వందశాతం టీకాలు అందించాలన్నారు. ఈ -సంజీవనిలో వెనకబడి ఉన్న పీహెచ్‌సీలు దృష్టి సారించాలన్నారు. సమయపాలన పాటించాలని ఉద్యోగులపై చర్యలు ఉంటాయని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పల్వాన్‌కుమార్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ నారాయణరావు, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఆనంద్, డాక్టర్ అరుణ్ కుమార్, డాక్టర్ శ్రీకళ, డాక్టర్ శ్రీకాంత్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుకు మొగ్గు చూపండి

ఉద్యాన శాఖ అధికారి సువర్ణ



మాట్లాడుతున్న ఉద్యానశాఖ అధికారి సువర్ణ

జగదేవ్‌పూర్(గజ్వేల్): రైతులు ఆయిల్‌పామ్ సాగు చేసి అధిక లాభాలు పొందాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి సువర్ణ, వ్యవసాయ అధికారి రాధిక అన్నారు. గురువారం జగదేవ్‌పూర్ రైతు వేదికలో ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో 12 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ పంట సాగు అవుతోందని, మరో 50 వేల ఎకరాలు లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం రాయితీ అవకాశం కల్పిస్తోందని, ఈ అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నాలుగేళ్ల వరకు అంతర పంటలను సాగు చేసుకోవాలని చెప్పారు. జగదేవ్‌పూర్‌లో బాల్‌రెడ్డి సాగు చేసిన ఆయిల్‌పాం, అంతర పంట అరటిసాగును పరిశీలించారు. అలాగే వరికొయ్యలను కాల్చవద్దని తెలిపారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాల్సిందే



సిద్దిపేట పట్టణంలో అమిత్ షా ఫ్లెక్సీని దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

- బాధ్యతాయుతమైన పదవిలో ఉండి అంబేడ్కర్‌ను అవమానించడమా?
- డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి
- సిద్దిపేటలో అమిత్ షా ఫ్లెక్సీ దహనం

సిద్దిపేటకమాన్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేసిన అమిత్ షాను కేంద్రమంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సిద్దిపేట బస్టాండ్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి, అమిత్ షా ఫ్లెక్సీని దహనం చేశారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ బాధ్యతాయుతమైన పదవిలో ఉండి ఇలాంటి వాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. దళితుల పట్ల బీజేపీకి ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో బయటపడిందన్నారు. బేషరతుగా అమిత్ షా క్షమాపణలు చెప్పాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ, నాయకులు జి శ్రీనివాస్, మార్క సతీష్‌కుమార్, ముద్దం లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

అడ్వకేట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

సిద్దిపేటకమాన్: ఎస్సీ ఎస్టీ అడ్వకేట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రవిబాబు, సీనియర్ న్యాయవాది బాపురావు మాట్లాడుతూ అమిత్ షా అంబేడ్కర్ పట్ల చేసిన వాఖ్యలను వెనక్కి తీసుకుని దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. ప్రపంచంలోనే అతి గొప్ప రాజ్యాంగాన్ని నిర్మించిన అంబేడ్కర్ ని అవమానించడం అంటే ప్రజలందరినీ అవమానించిన ట్లేనన్నారు. కార్యక్రమంలో పత్రి ప్రకాష్, యాదగిరి, ప్రవీణ్, ప్రసాద్, లావణ్య, అరుణ, వెంకటేష్, శ్రీనివాస్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నాచగిరికి రూ.16.84 లక్షల ఆదాయం

వర్గల్(గజ్వేల్): నాచగిరి లక్ష్మీనృసింహక్షేత్రంలో గురువారం వివిధ హుండీ కానుకల సొమ్మును లెక్కించారు. గడచిన 87 రోజులలో భక్తులు వేసిన కానుకల ద్వారా రూ. 16,84,547 ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి అన్నపూర్ణ తెలిపారు. హుండీ కానుకల లెక్కింపులో భ్రమరాంభిక సేవాసమితి సభ్యులు, ఆలయ సిబ్బంది సుధాకర్, పాండు, నరేందర్, భక్తులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి
- ముగిసిన సీఎం కప్ క్రీడలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న జిల్లా గ్రంథాలయ చైర్మన్ లింగమూర్తి

సిద్దిపేటజోన్: సీఎం కప్ క్రీడలతో గ్రామీణ క్రీడాకారులకు మంచి గుర్తింపు తేనుందని, జాతీయ స్థాయిలో రాణించేలా దోహదపడుతుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి అన్నారు. స్థానిక డిగ్రీ కళాశాల మైదానంలో గురువారం సాయంత్రం సీఎం కప్ క్రీడల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి చేపట్టిన యంగ్ ఇండియా, స్కిల్ ఇండియా వల్ల భవిష్యత్తులో సానుకూలంగా ఫలితాలు వస్తాయని అన్నారు. అంతకుముందు ఆదనపు కలెక్టర్ హమీద్ మాట్లాడుతూ.. ఈనెల 27నుంచి సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీలు జరుగనున్నాయని, జిల్లాలో విజయం సాధించిన వారు రాష్ట్ర స్థాయిలో పాల్గొంటారని పేర్కొన్నారు.

ఓవరాల్ ఛాంపియన్ సిద్దిపేట..

మూడు రోజుల పాటు సాగిన జిల్లా స్థాయి సీఎం కప్ పోటీల్లో సిద్దిపేట ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచింది. బాలురుల, బాలికల విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చింది. వాలీబాల్ బాలురుల విభాగంలో కొండపాక ప్రథమ స్థానం, నంగనూర్ ద్వితీయ స్థానంలో నిలిచింది. అదేవిధంగా వాలీబాల్ బాలికల విభాగంలో గజ్వేల్ మొదటి స్థానం, కొండపాక రెండవ స్థానంలో నిలిచింది. ఖోఖో బాలురుల విభాగంలో సిద్దిపేట విన్నర్, గజ్వేల్ రన్నర్‌గా నిలిచింది. బాలికల విభాగంలో జగదేవపూర్ విన్నర్, దుబ్బాక రన్నర్‌గా నిలిచాయి. కబడ్డీ బాలురుల విభాగంలో మద్దూర్ విజేతగా, హుస్నాబాద్ రన్నర్‌గా నిలిచాయి. అదేవిధంగా బాలికల విభాగంలో గజ్వేల్ విన్నర్, దుబ్బాక రన్నర్‌గా నిలిచాయి. వీటితో పాటు మిగతా15 అంశాల్లో విజయం సాధించిన వారికి బహుమతులు అందజేశారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

సీఎం కప్ క్రీడల ముగింపు రోజు ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. హుస్నాబాద్, మద్దూర్ జట్ల మధ్య కబడ్డీ ఫైనల్ మ్యాచ్ జరుగుతుండగా అభిమానుల మధ్య జరిగిన వాగ్వాదం పరస్పర దాడులకు దారి తీసింది. ఇరువర్గాల వారు దాడులకు దిగడంతో హుస్నాబాద్ క్రీడాకారుడు నాగరాజు తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే పోలీసులు జోక్యం చేసుకొని ఇరువర్గాలను శాంతింపజేశారు.



గాయపడిన నాగరాజు

రెవెన్యూ డివిజన్ అయ్యేనా!

- అసెంబ్లీలో మంత్రి ప్రకటనతో మళ్లీ తెరపైకి
- పెండింగ్‌లోనే ఉన్న దుబ్బాక
- చిరకాల కల నెరవేరుతుందనే ఆశతో ఎదురుచూస్తున్న ప్రజలు
- సీఎం రేవంత్‌రెడ్డిని కలవడంతోపాటు అసెంబ్లీలోనూ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రస్తావన

దుబ్బాక : రాష్ట్ర వ్యాప్తంగా కొత్త రెవెన్యూ డివిజన్లు, మండలాలు ఏర్పాటు చేయాలనే డిమాండ్‌లపై చర్చిస్తున్నామని అసెంబ్లీ సమావేశాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. ఈ నేపథ్యంలో దుబ్బాక రెవెన్యూ డివిజన్ కల కాంగ్రెస్ ప్రభుత్వంలో నెరవేరుతుందనే ఆశ ప్రజల్లో నెలకొంది. ఈ సమావేశాల్లోనే రెవెన్యూ డివిజన్‌పై ప్రభుత్వం ప్రకటన వెల్లడిస్తుందని నమ్మకంతో ప్రజలు ఎదురుచూస్తున్నారు.

దుబ్బాక రెవెన్యూ డివిజన్‌కు అన్ని విధాలుగా అర్హత ఉన్నప్పటికీ ఏర్పాటు చేయకపోవడంతో 2016లో ఈ విషయంపై దుబ్బాక పట్టణంలో 45 రోజులపాటు ఉద్యమం తీవ్రంగా జరిగింది. పాత సమితి కేంద్రంగా, తాలుకాగా, నియోజకవర్గం కేంద్రంగా మున్సిపాల్టీగా ఉన్న దుబ్బాకకు రెవెన్యూ డివిజన్‌కు కావాల్సిన అన్ని అర్హతలు ఉన్నా కాకపోవడంపై ప్రజల్లో తీవ్ర నిరాశ నెలకొంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు రెవెన్యూ డివిజన్ కోసం నిరంతరం ఉద్యమాలు కొనసాగుతూనే ఉన్నాయి. అఖిల పక్షం ఆధ్వర్యంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తున్నారు. నియోజకవర్గం కేంద్రాలైన గజ్వేల్, హుస్నాబాద్‌లను రెవెన్యూ డివిజన్లు చేసి నియోజకవర్గం కేంద్రమైన దుబ్బాకను చేయకపోవడం శోచనీయమని ప్రజలు వాపోతున్నారు.

దుబ్బాక పట్టణం వ్యూ..



92 రెవెన్యూ గ్రామాలతో డివిజన్

దుబ్బాక నియోజక వర్గంలో ప్రస్తుతం 8 మండలాలు ఉండగా చేగుంట, నార్సింగ్ మండలాలు తూప్రాన్ డివిజన్‌లో ఉన్నాయి. సిద్దిపేట డివిజన్‌లో ఉన్న దుబ్బాక, మిరుదొడ్డి, తొగుట, భూంపల్లి-అక్బర్‌పేట మండలాలతోపాటు గజ్వేల్ డివిజన్‌లో ఉన్న దౌల్తాబాద్, రాయపోల్ మండలాలతో కలిపి మొత్తం 6 మండలాలతో దుబ్బాక రెవెన్యూ డివిజన్ ను ఏర్పాటు చేసే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ ఆరు మండలాల పరిధిలో దుబ్బాక మున్సిపాల్టీతోపాటు 92 రెవెన్యూ గ్రామాలు 115 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 2 లక్షలకు పైగా జనాభాతో పాటు ఫారెస్ట్ రేంజ్ ఆఫీస్, ఐసీడీఎస్, వ్యవసాయ శాఖ సబ్ డివిజన్, పీఆర్, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, మిషన్ భగీరథ, హార్టీకల్చర్ సబ్ డివిజన్ కార్యాలయాలతోపాటు బస్ డిపో ఉంది. కాబట్టి డివిజన్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి హామీ..

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా దుబ్బాకలో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే దుబ్బాకను రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. సీఎం ఇచ్చిన హామీ ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే తప్పకుండా నెరవేరుతుందన్న గంపెడాశ ఈ ప్రాంత ప్రజల్లో నెలకొంది. 8 నెలల కిందట సీఎం రేవంత్‌రెడ్డిని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేకంగా కలువడం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చ జరగడం అందరికీ తెలిసిందే. కాకపోతే తాను దుబ్బాక రెవెన్యూ డివిజన్‌తోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాల కోసమే సీఎం ను కలిశానని ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై సీఎం సానుకూలంగా ఉన్నారని తప్పకుండా ఈ దిశగా చర్యలు జరుగుతున్నాయనే ప్రచారం జోరందుకుంది.

ఉద్యమం తీవ్రతరం చేస్తాం



దుబ్బాక రెవెన్యూ డివిజన్ కోసం అఖిల పక్షం ఆధ్వర్యంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం. రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు, కుల సంఘాలు, యువజన సంఘాలు, విద్యార్థి, మేధావులతో కలిసి ప్రత్యేక కార్యాచరణను రూపొందించుకొని అఖిల పక్షం ఆధ్వర్యంలో సీఎం, మంత్రులను కలుస్తాం.

– మాదవోయిన శ్రీకాంత్, అఖిల పక్షం నాయకులు

శాంతి భద్రతల పరిరక్షణకు పెద్దపీట

- సీపీ అనురాధ
- సిద్దిపేటలో రాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బందితో ఫ్లాగ్ మార్చ్



జెండా ఊపి ఫ్లాగ్ మార్చ్‌ను ప్రారంభిస్తున్న సీపీ అనురాధ, పక్కన ఏసీపీ మధు

సిద్దిపేటకమాన్: శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలకు మేమున్నామని భరోసా కల్పించడం ఫ్లాగ్ మార్చ్ ముఖ్య ఉద్దేశ్యమని సీపీ అనురాధ తెలిపారు. సిద్దిపేట పట్టణంలో రాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బందితో నిర్వహించిన ఫ్లాగ్ మార్చ్‌ను బస్టాండ్ చౌరస్తా వద్ద ఏసీపీ మధు, సీఐలు వాసుదేవరావు, ఉపేందర్, విద్యాసాగర్‌లతో కలిసి సీపీ గురువారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాల్లో భాగంగా ఆర్‌పిఎఫ్ సిద్దిపేటకు రావడం జరిగిందన్నారు. శాంతి భద్రతల సమస్య తలెత్తినప్పుడు పోలీసు అధికారులతో కలిసి బందోబస్తు నిర్వహించి, ఫ్లాగ్ మార్చ్ ద్వారా ప్రజలకు సెన్సాఫ్ సెక్యూరిటీ, మేమున్నామనే భరోసా కల్పించడం జరుగుతుందన్నారు. ఈ నెల 20న హుస్నాబాద్ పట్టణం, 21న గజ్వేల్ పట్టణంలో, 22న కొమురవెల్లి మండల కేంద్రంలో, 23న దుబ్బాక పట్టణంలో, 24న సిద్దిపేట వన్ టౌన్ పీఎస్ పరిధిలో ఫ్లాగ్ మార్చ్ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. పట్టణంలో బస్టాండ్ చౌరస్తాతో పాటు ప్రధాన ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్, రాపిడ్ యాక్షన్ ఫోర్స్ డిప్యూటీ కమాండెంట్ బగేల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాక్టరీ రద్దు చేసే వరకు పోరాటం



పరిశ్రమ వద్ద మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

బెజ్జంకి(సిద్దిపేట) : పర్యావరణ కాలుష్యానికి కారణమయ్యే ఇథనాల్ ఫ్యాక్టరీ రద్దు కోసం ప్రజలతో కలిసి ఉద్యమిస్తామని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. మండలంలోని గుగ్గిల్ల శివారులో నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీ వద్ద గ్రామస్తులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు అసౌకర్యంగా మారే ఫ్యాక్టరీ రద్దు కోరుతూ ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామన్నారు. వారు స్పందించకుంటే రద్దు చేసే వరకు ఐక్యంగా పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మంద పవన్, కార్యవర్గ సభ్యుడు వెంకట్‌రెడ్డి, రూపేశ్, భాస్కర్, మధు, జనార్దన్, నరేశ్, మహేశ్, శ్రవణ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, బెజ్జంకిలో గురువారం నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీపీఐని గ్రామ స్థాయిలో బలోపేతం చేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజలకు అండగా ఉండి పోరాడాలన్నారు.

క్లుప్తంగా

జాతీయ స్థాయి పోటీలకు మెదక్ క్రీడాకారులు



సాఫ్ట్‌బాల్ క్రీడాకారులు

తూప్రాన్: జాతీయ స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు కోడిప్యాక నారాయణగుప్త గురువారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 20 నుంచి జమ్మూ కాశ్మీర్‌లోని ఎంఏ క్రీడా మైదానంలో 37వ జాతీయ స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ బాల, బాలికల చాంపియన్‌షిప్ పోటీలు జరుగుతున్నాయని తెలిపారు. 24 వరకు పోటీలు జరగనున్న నేపథ్యంలో ఈ పోటీలకు రాష్ట్ర బాల, బాలికల జట్టుకు జిల్లాకు చెందిన 8 మంది క్రీడాకారులు ఎంపికయ్యారని వివరించారు. నవంబరు నెలలో రాష్ట్ర స్థాయిలో జరిగిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి బాలికల జట్టులో కార్తీక, శ్రీకృతి, శిరీష, గీతిక, బాలుర జట్టులో విజయ్, శ్రీవాత్సవ, వరుణ్, నిషాంత్ రాష్ట్ర జట్టులో స్థానం పొందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అజయ్ కుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శి శ్యాం సుందర్ శర్మ, కోశాధికారి గోవర్దన్ గౌడ్, అసోసియేషన్ సభ్యులు వెంకట్ రెడ్డి, కుమార్‌గౌడ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఏఆర్ కానిస్టేబుల్ మృతి



రాజు (ఫైల్)

సిద్దిపేటకమాన్: సిద్దిపేట పోలీసు కమిషనరేట్ పరిధిలోని ఏఆర్ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న దేగల వెంకటరామరాజు (53) గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. గణేశ్ నగర్‌లో నివాసం ఉంటున్న కానిస్టేబుల్ రాజుకు ఉదయం గుండెనొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. రాజుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ పూర్ణచందర్, ధరణి కుమార్, రాజేశ్, పోలీసు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీందర్ రెడ్డి, పోలీసు అధికారులు, సిబ్బంది మృతదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ప్రభుత్వం తరఫున అంత్యక్రియలకు రూ.30 వేలు మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. కానిస్టేబుల్ అకస్మాత్తుగా మృతి చెందడంపై సీపీ అనురాధ సంతాపం వ్యక్తం చేశారు.

దైవ దర్శనానికి వెళ్లిన వ్యక్తి..

జగదేవ్‌పూర్(గజ్వేల్): దైవ దర్శనానికి వెళ్లి వస్తూ గుండెపోటుతో వ్యక్తి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. జగదేవ్‌పూర్‌కు చెందిన నగేశ్ గౌడ్ (48) తన మిత్రులతో కలిసి 15వ తేదీ సాయంత్రం శబరిమలైలో అయ్యప్ప స్వామి దర్శనం చేసుకున్న అనంతరం బుధవారం తిరిగి తమిళనాడులోని మధురై చేరుకుని మీనాక్షి దేవాలయంలో దర్శనం చేసుకున్నారు. రాత్రి అక్కడే ఉండి గురువారం ఉదయం రామేశ్వరం వెళ్లాలని నిర్ణయించుకున్నారు. తెల్లవారుజామున బాత్‌రూమ్‌కి వెళ్లొచ్చిన నగేశ్ గౌడ్ ఒక్కసారిగా బెడ్‌పై పడిపోయాడు. గమనించిన తోటి మిత్రులు ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. శుక్రవారం జగదేవ్‌పూర్‌లో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

బతుకుదెరువు కోసం వెళ్లి..

- జార్ఖండ్‌లో అక్కన్నపేట వాసి మృతి
- విధులకు వెళ్తుండగా ఢీకొట్టిన వ్యాన్



ప్రవీణ్(ఫైల్)

అక్కన్నపేట(హుస్నాబాద్): బతుకుదెరువు కోసం జార్ఖండ్ రాష్టానికి వెళ్లిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. అక్కన్నపేట మండలం మసిరెడ్డితండా గ్రామ పంచాయతీ పరిధిలోని ర్యాగటోనిపల్లెకి చెందిన ర్యాగటి సారవ్వ-చంద్రయ్య దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడైన ప్రవీణ్(25) బీటెక్ పూర్తి చేసి జార్ఖండ్‌లో హెచ్‌సీఎల్ సూర్ధ మైన్స్ మైనింగ్ కంపెనీలో ఫోర్ మెన్‌గా ఉద్యోగం చేస్తూ అక్కడే ఉంటున్నాడు. రోజు మాదిరిగా గురువారం విధులకు హాజరయ్యేందుకు బైక్‌పై వెళ్తుండగా వెనుక నుంచి వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రవీణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం శుక్రవారం మృతదేహం స్వగ్రామానికి చేరుకోనున్నట్లు పేర్కొన్నారు. ఉన్నత చదువులు చదివి ఉద్యోగం చేస్తూ తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉన్న ప్రవీణ్ మృతి చెందడం పల్లెవాసులకు కలచివేసింది.

• విద్యార్థినికి టీచర్ల సన్మానం

మిరుదొడ్డి(దుబ్బాక): పంజాబ్‌లోని లూధియానా టౌన్‌లో 11, 12, 13 తేదీలల్లో జరిగిన 68వ నేషనల్ నెట్ బాల్ క్రీడల్లో అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని ఖాజీపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన కె.అనన్య అత్యుత్తమ ప్రతిభను కనబర్చి ప్రసంసాపత్రాన్ని అందుకున్నారు. దీంతో ఆమెను టీచర్లు గురువారం ఘనంగా సన్మానించారు. హెచ్ఎం జగన్‌మోహన్‌రాజ్, పీడీ నరేశ్, టీచర్లు లక్ష్మీనర్సింహులు, సుముఖేశ్వర్‌రెడ్డి, జీవన్‌కుమార్, శ్యామల, మధుసూధన్‌రెడ్డి, పద్మ, ధన్‌రాజ్, స్వామి, దుబ్బరాజం తదితరులు పాల్గొన్నారు.

• రామ, శివ లిఖిత కరపత్రాల ఆవిష్కరణ

గజ్వేల్‌రూరల్: శృంగేరీ పీఠం సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన రామ, శివ కోట్లాది లిఖిత మహాయజ్ఞం కరపత్రాలను రామకోటి భక్తసమాజం ఆధ్వర్యంలో గజ్వేల్‌లో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రామకోటి భక్తసమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు, శృంగేరీ పీఠం నిర్వాహకులు జయదుర్గ, కృష్ణాలయం ప్రతినిధులు రామచంద్రం, దూబకుంట మైత్రాములు, సత్యనారాయణ, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

• బాలుర హబ్‌లో సమస్యలపై కలెక్టర్‌కు వినతి

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నిఖత్ అంజుమ్ కలెక్టర్ మను చౌదరికి వినతిపత్రం అందించారు. హబ్‌లో నీటి సౌకర్యం, వీధి దీపాలు, ఆడిటోరియం, డ్రైనేజీ వ్యవస్థతో పాటు వాచ్‌మెన్లు అవసరమన్నారు. మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, కమిషనర్ నర్సయ్యకు సైతం వినతిపత్రాలను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌గౌడ్, హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి, హాస్టల్ వార్డెన్లు కవిత, దేవదాసు, కనకయ్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

• అక్రమ కేసులతో గొంతునొక్కుతారా?

– మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్

గజ్వేల్: అక్రమ కేసులతో ప్రభుత్వం ప్రతిపక్షం గొంతు నొక్కాలని చూస్తోందని గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ మండిపడ్డారు. గురువారం గజ్వేల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫార్ములా ఈ రేస్ ఈవెంటును హైదరాబాద్‌లో నిర్వహించి పెట్టుబడులను ఆకర్షించిన కేటీఆర్ నిర్ణయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుబట్టడం సిగ్గుచేటన్నారు. త్యాగాలతో తెలంగాణను సాధించిన బీఆర్ఎస్‌కు కేసులు, అరెస్టులు కొత్త కాదని, ప్రభుత్వం ఎన్ని రకాల కుట్రలు చేసినా బీఆర్ఎస్ ప్రజల పక్షాన ప్రశ్నించడం ఆపదని చెప్పారు.

• నానో యూరియా, డీఏపీతో మేలు

చిన్నకోడూరు(సిద్దిపేట): నానో యూరియా, డీఏపీ వినియోగం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని ఇఫ్కో సంస్థ మేనేజర్ కృపా శంకర్ అన్నారు. నానో యూరియా, డీఏపీ వినియోగంపై చిన్నకోడూరు రైతు వేదికలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. నానో యూరియా, డీఏపీ పిచికారి చేయడం ద్వారా ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఇఫ్కో జిల్లా మేనేజర్ చంద్రబాబు, శాస్త్రవేత్త నరేశ్, ఎఫ్‌పీసీ చైర్మన్ రాంరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

• వాణిజ్య పంటలతో మేలు

సిద్దిపేటఅర్బన్: వాణిజ్య పంటలు సాగు చేయడం వల్ల రైతులకు అధిక ఆదాయం పొందుతారని అర్బన్ మండల ఏఓ శ్రీనాథ్ అన్నారు. గురువారం కిష్టసాగర్ గ్రామంలో రైతులు చిల్ల రజిత, జీకురు యాదగిరి సాగు చేస్తున్న పొగాకు పంటను పరిశీలించి యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ పిలకలను అరికట్టుటకు సీ10 ఫ్యాటీ ఆల్కహాల్‌తో చేసిన 4శాతం డెకనాల్ లేదా సక్కర్ప్వట్ లేదా రాయల్టన్ మందును వాడుకోవాలన్నారు. ఆయన వెంట ఏఈఓ మీరా బాయి ఉన్నారు.

• ఇంధనం పొదుపు సామాజిక బాధ్యత

కోహెడ(హుస్నాబాద్): ఇంధనం పొదుపు సామాజిక బాధ్యత అని సంకల్ప స్వచ్ఛంద సేవా సమితి అధ్యక్షుడు వలుస సుభాష్ అన్నారు. స్థానిక హైస్కూల్‌లో ఇంధనం పొదుపు ప్రాముఖ్యతపై గురువారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఈ నెల 14 నుంచి 20 వరకు మహిళా సంఘాలకు, విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. హెచ్ఎం మహమూద్, బైరి చంద్రశేఖర్, రాచపల్లి దేవేందర్ పాల్గొన్నారు.

• ట్రాక్టర్ కిందపడి డ్రైవర్ మృతి

దుబ్బాకరూరల్: ట్రాక్టర్ కిందపడి డ్రైవర్ మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ గంగరాజ్ కథనం మేరకు.. వెంకటగిరి తండాకి చెందిన అజ్మీరకమల్ నూతనంగా ఇల్లు నిర్మించుకుంటున్నాడు. బుధవారం రాత్రి శిలాజీనగర్ గ్రామా నికి చెందిన పెంబర్తి ట్రాక్టర్ డ్రైవర్ రాకేష(23) ఇంటి నిర్మాణానికి ట్రాక్టర్‌లో మట్టిని తరలిస్తున్నాడు. వాహనం నడుపుతున్న క్రమంలో ఒక్కసారిగా కిందపడటంతో టైర్లు మీది నుంచి వెళ్లాయి. తీవ్రగాయాలైన అతడిని దుబ్బాక ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తండ్రి కనకయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇస్రో శాస్త్రవేత్తగా బెజ్జంకి యువకుడు



ఒజ్జపల్లి శ్రీమాన్

బెజ్జంకి(సిద్దిపేట): మండల కేంద్రానికి చెందిన ఒజ్జపల్లి శ్రీమాన్ ఇస్రోలో శాస్త్రవేత్తగా ఎంపికయ్యారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఒజ్జపల్లి నాగయ్య, సత్యలక్ష్మిల కుమారుడు. 2023లో ఇస్రోలో రాసిన పరీక్షలకు గాను బుధవారం వచ్చిన ఫలితాలలో ఆయన శాస్త్రవేత్తగా ఎంపికయ్యారని తండ్రి నాగయ్య తెలిపారు. బెంగళూరులోని ఐఐఎస్‌సీలో ఎంటెక్ చదివి గోల్డ్ మెడల్ సాధించారు. అమెరికాలోని ప్రసిద్ధ సంస్థ కెడెల్స్‌లో డిజైన్ ఇంజనీర్‌గా ప్రస్తుతం పనిచేస్తున్నారు. బెజ్జంకి యువకుడు ఇస్రో శాస్త్రవేత్తగా ఎంపికకావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇద్దరు అదృశ్యం

ఇంటి నుంచి వెళ్లి మహిళ..

చేగుంట(తూప్రాన్): ఇంటి నుంచి వెళ్లిన మహిళ అదృశ్యమైన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి కథనం మేరకు.. మండలంలోని బోనాల గ్రామానికి చెందిన పుల్లబోయిన నాగరాణి భర్త మృతి చెందడంతో గ్రామంలోనే పుట్టింట్లో ఉంటుంది. బుధవారం ఇంట్లో వారంతా వ్యవసాయ పనులకు వెళ్లగా నాగరాణి ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లి పోయింది. తల్లి శశికళ తెలిసిన వారి వద్ద, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పనికి వెళ్లిన యువతి..

అక్కన్నపేట(హుస్నాబాద్): యువతి అదృశ్యమైన ఘటన అక్కన్నపేట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై విజయ్ భాస్కర్ కథనం మేరు.. అక్కన్నపేట మండలానికి చెందిన ఓ యువతి(21) హుస్నాబాద్ పట్టణంలోని ఓ దుకాణంలో వర్కర్‌గా పని చేస్తుంది. 14వ తేదీన ఇంటి నుంచి ఎప్పటిలాగే హుస్నాబాద్‌కు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. యువతి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

సంక్షోభంగా మారిన సంక్షేమం

- 6 గ్యారంటీలు, 66 హామీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం
- రాష్ట్రంలో రైతుల, విద్యార్థుల మరణాలు కలిచివేస్తున్నాయి
- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న కాసం వెంకటేశ్వర్లు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సంక్షేమం సంక్షోభంగా మారిందని, అభివృద్ధి అవినీతిగా మారిందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదైన సందర్భంగా ఆ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలపై గురువారం బీజేపీ జిల్లా కార్యాలయంలో వెంకటేశ్వర్లు విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి ఏడాది పాలనలో అవినీతి తప్ప ఎక్కడ అభివృద్ధి దాఖలాలు కనిపించడం లేదని విమర్శించారు. ప్రతి పక్షాలపై నిందలు వేయడం తప్ప సీఎం చేసిన ఒక్క మంచి పని లేదన్నారు. రేవంత్ రెడ్డి లక్కీగా సీఎం అయ్యాడని ఆయనకు పరిపాలన చేయడం తెలియదని విమర్శించారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో 50 మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. ఫార్మా కంపెనీకి భూములు ఇవ్వనందుకు లగచర్ల రైతులను ఇబ్బందులు పెట్టి వారి చేతులకు సంకెళ్లు వేయడం సిగ్గుచేటన్నారు. వరి ధాన్యం కొనుగోలులో తీవ్ర జాప్యం చేసిందన్నారు. రేవంత్ రెడ్డికి పరిపాలన చేతకాక హైడ్రా, మూసీ సుందరీకరణ, ప్రతిపక్షాల అరెస్టులతో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ తెలంగాణను అన్ని రంగాల్లో వెనుకకు నెట్టేస్తున్నాడన్నారు. రాష్ట్రంలో విద్యాశాఖ పూర్తిగా విఫలమయ్యిందన్నారు. ఇప్పటికైనా సీఎం రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్ రెడ్డి, దూది శ్రీకాంత్ రెడ్డి, సొప్పదండి విద్యాసాగర్, విభీషన్ రెడ్డి, కోడూరి నరేశ్, గోనె మార్కండేయులు, లక్కిరెడ్డి తిరుమల, ఉమా సురేష్ రెడ్డి పాల్గొన్నారు.

సమాజ సేవకే లీగల్ సర్వీసెస్ అథారిటీ



స్వాతిరెడ్డిని సన్మానిస్తున్న మహిళలు

సిద్దిపేటరూరల్: సమాజంలో హింసలకు, గృహ హింసలకు, లైంగిక వేధింపులు గురయ్యే పేదలకు సేవ చేసేందుకే లీగల్ సర్వీసెస్ అథారిటీ ఉందని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి స్వాతిరెడ్డి సూచించారు. గురువారం మండల పరిధిలోని పుల్లూరు గ్రామంలో లైంగిక వేధింపులు, గృహ హింసల చట్టాలపై న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్వాతి రెడ్డి హాజరై మాట్లాడారు. ఎవరైనా పని ప్రదేశాల్లో గాని, మరెక్కడైనా గాని లైంగికంగా వేధింపులకు గురి చేస్తేఅధైర్య పడకుండా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. లీగల్ సర్వీసెస్ అథారిటీ టోల్ ఫ్రీ నంబర్ 15100 కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చన్నారు. అంతకుముందు ఏసీపీ మధు మాట్లాడుతూ.. మహిళలపై ఎలాంటి అరాచకాలు జరిగినా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని, 24 గంటల పాటు పోలీసు యంత్రాంగం అందుబాటులో ఉంటుందని డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. అనంతరం స్వాతిరెడ్డిని గ్రామ మహిళలు ఘనంగా శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సీఐ శ్రీను, ఎస్ఐ అపూర్వరెడ్డి, మల్లేశం, పంచాయతీ కార్యదర్శి గౌస్, కానిస్టేబుళ్లు, తదితరులు పాల్గొన్నారు.

ఎనగుర్తిలో కొత్త రాతియుగం నాటి ఆనవాళ్లు

- బండపై ఆది మానవులు తయారు చేసుకున్న పనిముట్ల గుర్తులు
- క్రీస్తు పూర్వం 5 వేల ఏళ్ల నాటి పునరావాస ఆనవాళ్లు
- చరిత్ర పరిశోధకుల అన్వేషణలో వెలుగులోకి..



శ్రీనివాస్, చరిత్ర పరిశోధకులు

దుబ్బాక : దుబ్బాక మండలం ఎనగుర్తిలో కొత్తరాతి యుగం నాటి ఆనవాళ్లు వెలుగుచూశాయి. ఇటీవలె చరిత్ర పరిశోధకుల అన్వేషణలో ఎనగుర్తిలో కాశీ విశ్వనాథస్వామి ఆలయం సమీపంలో బండల మీద పురమానవుల ఆనవాళ్లు భయడపడటం విశేషం. ఎత్తైన గుట్ట మీద పెద్ద బండరాయిలపై పుర మానవులు తమ ఆహార సేకరణలో భాగంగా ఉపయోగించే రాతి పనిముట్లు (రాతి గొడ్డళ్లు) నూరుకున్న గుంతలను (గ్రూవ్స్) దాదాపు 20కి పైగా ఉన్నట్లు చరిత్ర పరిశోధకులు గుర్తించారు. ఈ ఆనవాళ్లను బట్టి ఈ ప్రాంతంలో క్రీస్తు పూర్వం 5 వేల ఏళ్ల కిందట నాటి ఆదిమ మానవులు నివసించినట్లు చరిత్ర పరిశోధకులు తెలిపారు. ఎనగుర్తితోపాటు జిల్లాలోని సిద్దిపేట, నంగునూర్, నర్మెట్ట, వీరారెడ్డిపల్లిల్లోనూ ఆదిమ మానవుల ఆనవాళ్లు ఇది వరకే గుర్తించారు. తాజాగా ఎనగుర్తిలో వెలుగులోకి రావడం ఆసక్తికరంగా మారింది. దీనిపై ఇంకా లోతుగా పరిశోధిస్తున్నట్లు చరిత్ర పరిశోధకులు కొలిపాక శ్రీనివాస్ తెలిపారు.



పనిముట్లు నూరినట్లు ఆనవాళ్లు



ఆది మానవులు నివసించినట్లు గుర్తించిన ప్రాంతం